# ఎవరిది లోపం?

## దూరి వెంకటరావు

"రమణయ్యగారికి,

నేను మీ అమ్మాయిని చేసుకోవడంలేదు. వెంటనే పెళ్ళి ఏర్పాట్లు మానండి. ముహూర్తం దగ్గర పడే ముందు నేనిలా వ్రాయడం మీకు ఆశ్చర్యంతో పాటు బాధ కూడా కలుగవచ్చు. పీటల మీద వరకు తెచ్చి తప్పుకున్నందుకు నన్ను మీరెన్నో విధాల నిందించుకుంటారు. నేనీ నిర్ణయానికి రావడానికి కారణం మీ అమ్మాయి లావణ్యే. నేను త్రాగుబోతునని, ఆడపిల్లల్ని అల్లరిపెట్టడం నా హాబీ అని రకరకాలుగా నిందిస్తూ ఉత్తరం వ్రాసింది. ఆమె వ్రాసిన లేఖ కూడా దీంతో జతపరుస్తున్నాను. నన్ను చేసుకోవడం ఇష్టం లేనప్పుడు నిర్మొహమాటంగా ఆ విషయం చెప్పి వుంటే ఎంతో సంతోషించేవాణ్ని. లేనిపోని అవలక్షణాలన్నీ నాకు అంటగట్టి సంబంధం తప్పించుకోవాలనుకోవడం ఆమె అవివేకాన్ని అజ్ఞానాన్ని చాటుతుంది. ముందుముందు ఆమె భవిష్యత్తుకే ముప్పు

ఇట్లు

సుదర్శన్."

ఉత్తరం చదవటం పూర్తిచేసిన, రమణయ్యగారికి వంటి నిండా కారం పూసుకున్నట్లుంది.

"జానకి! .." ఇల్లు దద్దరిల్లేటట్టు పిలిచారు.

"అమ్మ గుడికెళ్ళింది నాన్నా" అన్నది రమణి తండ్రి కోపానికి విస్మయం చెందుతూ.

"సరేలే, లావణ్య ఏం చేస్తోంది?" కాస్త తగ్గింపు స్వరంలో అడిగారు రమణయ్యగారు.

"కాలేజీకెళ్ళింది .... ఏం కావాలి నాన్నా ... కాఫీగాని తెమ్మంటారా" అడిగింది రమణి.

"కాఫీయా అక్కర్లేదు ... మీ చెల్లెలు చేసిన పనికి కడుపు నిండిపోయిందమ్మా ... వెళ్ళు ..." కసురుకున్నట్లుగా అన్నారు రమణయ్యగారు.

విషయం అర్థంకాక విస్తుపోయింది రమణి.

ఉత్తరాన్ని మడిచి, కళ్ళజోడు తీసి బల్లమీద వుంచుతూ దీర్ఘాలోచనలో పడ్డారు రమణయ్యగారు. అతని ఆలోచనలు నెల రోజులు వెనక్కిమళ్ళాయి.

* * * *

రమణయ్యగారు మధ్యతరగతికి చెందిన సగటు మనిషి. మునిసిఫ్ కోర్టులో గుమస్తా గిరి చేసి ఈ మధ్యే రిటైరయ్యారు. పెళ్ళీడుకొచ్చిన రమణి, లావణ్య అతని కూతుళ్ళు. పెద్ద పిల్ల రమణి అందంలో అప్సరస కాకపోయినా చూడ్డానికి బాగానే వుంటుంది. ఐతే ఆమె కుడి కాలుకాస్త పొట్టి అవడంతో నడకలో కాస్త తేడా కనిపిస్తుంది. అదే పెద్ద లోపంగా ఎంచి ఎన్ని సంబంధాలు చూసినా ఎవరూ పెళ్ళి చేసుకోవడానికిష్టపడలేదు.

పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళు రమణిని చూడ్డం, లావణ్యనైతే చేసుకుంటామని అనడం అటు కన్నవాళ్ళకు, ఇటు రమణికి కూడా గుండె కోత అయింది.

అక్క పెళ్ళికి తను ప్రతిబంధకం కాకూడదని ఒక్కోమారు పెళ్ళిచూపుల సమయానికి లావణ్య ఏ స్నేహితురాలింటికో వెళ్ళిపోయేది

అందరిలాగే సుదర్శన్ కూడా లావణ్యను చేసుకుంటానని అనగానే రమణి మరి బాధపడలేదు. తన దురదృష్టాన్ని తనే నిందించుకుని, తనకీ జన్మలో పెళ్ళికాదని చెల్లెలకు ఆ సంబంధం ఖాయం చేయమని అమ్మను నాన్నను బ్రతిమిలాడింది పెద్ద పిల్లకు పెళ్ళి చేయకుండా, కడదానికి కళ్యాణమేమిటని ఎంత చెప్పినా వినలేదు.

ఆఖరికి రమణయ్యగారు, రమణి మాటకు కట్టుబడి సుదర్శన్‌తో లావణ్య వివాహం స్థిరపరిచారు. ఈ వృద్ధాప్యంలో పోనీ ఒక్క పిల్ల నెత్తిమీదనైనా రెండక్షింతలు వేయబోతున్నందుకు ఎంతో సంబరపడిపోయారు. అంతలోనే ఏమిటీ విపరీతం? లావణ్య ఎందుకలా ఉత్తరం వ్రాసి సంబంధం చెడగొట్టుకుందో అర్థంకాక రెండు చేతులతో గట్టిగా కణతలు నొక్కుకుంటూ వాలు కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నారు.

లావణ్య కాలేజీ నుండి రాగానే కూతురు చేసిన నిర్వాకానికి మండిపడ్డారు రమణయ్యగారు.

"నేనెందుకీ సంబంధం తప్పించుకోవలసి వచ్చిందో కారణం తెలుసుకోకుండా నన్నాడిపోసుకోకండి" అన్నది లావణ్య బాధగా.

"కారణం ఏదైనా నీకతడు ఇష్టం లేకుంటే ఆ విషయంముందే చెప్పాలి. పీటల వరకూ సాగదీసి ఇప్పుడేవో కారణాలు చెప్పడం ఎవరూ హర్షించరు."

"ఒకరు హర్షిస్తారని గాని, మరొకరు నిందిస్తారని గాని నేనీ పని చేయలేదు మొన్నీ మధ్య సురేఖ పెళ్ళికి నర్సిపట్నం వెళ్ళినప్పుడు స్నేహితుల ప్రోద్బలం వల్ల శ్రావణసంధ్య సినిమాకు వెళ్ళవలసి వచ్చింది. కాకతాళీయంగా సుదర్శన్ నా కంటపడ్డాడు. అతడు హాల్లో కడుగు బెట్టగానే లైట్లు ఆర్పేసారు. నేనతడిని చూసానుగాని నన్నతడు గమనించలేదు. తూలుతూవచ్చి మా ముందర వరుసలో కూర్చున్నాడు అతడి నడకని బట్టి, అతడి నోటి నుండి వచ్చే వాసనను బట్టి, పీకలదాకా త్రాగుంటాడని వూహించాను. సినిమా అవుతూ వుండగా అతని ముందర సీట్లో కూర్చున్న వాళ్ళతో తగూ పడ్డాడు. ఆ తగూ సద్దుమణిగేసరికి పది నిమిషాలుపట్టింది ముందు సీట్లో కూర్చున్న అమ్మాయి భుజంపై చెయ్యి వేసాడన్నది తగవుకు కారణం. మేమంతా డబుల్ ప్రోగ్రాం చూసాం.

అక్క నడకలో కనిపించే అతి స్వల్పమైన వ్యత్యాసాన్ని పెద్ద లోపంగా ఎంచి, ఆమె కుంటిది, సొట్టది అని మనందరి మనసుల్ని గాయపరచిన సుదర్శన్‌ని, కళ్ళారా అతడి వాటాన్ని చూసిన నేను త్రాగుబోతు అని అనడంలో తప్పేముంది నాన్నా? పెళ్ళికి ముందే అతడి నైజాన్ని తెలుసుకున్న నేనెంతో అదృష్టవంతురాల్ని. ఇప్పుడు చెప్పండి. బాహ్యంగా మేడిపండులా కనిపించినా అంతర్యంగా ఇన్ని దుర్వ్యసనాలు కలిగివున్న సుదర్శన్‌ది లోపమా? ... కేవలం అవయవనిర్మాణంలో బాహ్యంగా కనిపించే అతి స్వల్పమైన లోపం కలిగివున్న రమణిది లోపమా? ... ఎవరిది లోపం? మీరే చెప్పండి" ఉద్రేకంతో ఊగిపోతూ అంది లావణ్య

కూతురు మాటల్లోని వాస్తవాన్ని గ్రహించిన రమణయ్యగారి నోటి నుండి మరి మాటలు పెగలేదు. □

